


sahanamvande.com
epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 10-10-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 168 EDITOR: ROHINI




# ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ

## నెల రోజుల్లో ల్యాండ్ క్లియర్!

- జీవో 59 పెండింగ్ దరఖాస్తులపై నిర్ణయం
- 500 గజాలలోపు భూములకు హక్కులు
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



**తెలంగాణలోని నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చే వార్త అందించింది. సొంత స్థలం ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ కాక, తమ ఆస్తి ఏ క్షణంలో 22ఏ జాబితాలోకి వెళ్తుందోనని ఆందోళన చెందుతున్న పౌరులకు ఇది గొప్ప ఉపశమనం. జీఓ నెంబర్ 59 కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లుగా ఎదురుచూస్తున్న 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న స్థలాల పెండింగ్ దరఖాస్తులను కేవలం నెల రోజుల్లోగా పరిష్కరించాలని సర్కార్ ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేస్తూ స్థానిక కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. - సహనం వందే, హైదరాబాద్**

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం అత్యంత వేగంగా ఉత్తర్వులు జారీ చేస్తోంది. అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి భూ చిక్కుముడులను విప్పేందుకు వేగవంతమైన చర్యలు ప్రారంభమయ్యాయి. జీవో 59 కింద వచ్చే ఆస్తుల విషయంలో భూమి అసలు రికార్డులు, లబ్ధిదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన అసలు విస్తీర్ణాన్ని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు.

గతంలో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే, గతంలో పూర్తయిన కేసుల కన్వేయన్స్ డీడ్లను కూడా సమగ్రంగా తనిఖీ చేస్తారు. అయితే న్యాయస్థానాల పరిధిలో ఉన్న వివాదాస్పద దరఖాస్తుల విషయంలో మాత్రం సంబంధిత తీర్పులకు లోబడి మాత్రమే తుది నిర్ణయం ఉంటుంది.

### 22ఏ భూముల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్

22ఏ జాబితాలోని భూ చిక్కుముడులను విప్పేందుకు ప్రభుత్వం ఒక ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని రూపొందించింది. అసెంబ్లీ వేదికగా ఇచ్చిన హామీ మేరకు మంత్రుల బృందం నిరంతరం చర్చలు జరిపి 10 నుంచి 12 రకాల వెదర్ సమస్యలను గుర్తించి పరిష్కారాలు చూపుతోంది. ఏళ్ల తరబడి పౌరులను వేధిస్తున్న భూ చిక్కులను రద్దు చేస్తూ వేగంగా నిర్ణయాలు తీసుకుంటుండటంతో రియల్ ఎస్టేట్ రంగానికే కాక సామాన్య గృహ యజమానులకు పెద్ద ఊరట లభిస్తోంది.

### అనుమతులున్న ప్లాట్లకు క్లియరెన్స్

గతంలో 22ఏ జాబితాలో ఉండటం వల్ల అనేక నిర్మాణాలు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కానీ ఇప్పుడు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపల్ అనుమతులు ఉన్న ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్లకు అనుమతులు మంజూరు చేశారు. దీనివల్ల వేలాదిమంది ప్లాట్ల యజమానులకు తమ ఆస్తులపై పూర్తి రిజిస్ట్రేషన్ హక్కులు లభిస్తున్నాయి.ఇదివరకు ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ ప్రజలకు సులభమైన పద్ధతిలో రిజిస్ట్రేషన్లు అయ్యేలా ఊరట కల్పించారు.

### అర్బన్ ల్యాండ్ సీలింగ్, నాలా సమస్యలకు చెక్

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దాంతో పాటు నాలా ప్రక్రియ పూర్తికాని పట్టాభూముల సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని దిశగా నిర్ణయాలు తీసుకుంది. వ్యవసాయేతర అవసరాలకు భూములను మార్చే ప్రక్రియలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించడంతో తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖలో మళ్లీ చలనం వచ్చింది. భూ వివాదాల సుడిగుండంలో ఉన్న పేద, మధ్యతరగతి వర్గాలకు ఇది సంతోషకరమైన నిర్ణయం.


మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

# కామ్రేడ్ కళ్యాణ్ కితకితలు

## 90ల నక్సలిజం బ్యాక్‌డ్రాప్‌లో నవ్వులు

- శ్రీవిష్ణు ఫుల్ ఆన్ కామెడీ మానియా
- రాధిక, సత్య మార్క్ హ్యూమర్
- ప్రథమార్థం ట్విస్టులతో సాగే వినోదాత్మక లవ్
- వీకెండ్‌కు మైండ్ ఫ్రీ ఎంటర్‌టైనర్
- సినిమా రివ్యూ రేటింగ్: 2.75/5

**1990ల కాలంలో ఆంధ్ర ఒడిశా సరిహద్దు ఏజెన్సీ ప్రాంత నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. నక్సలిజం ఊపందుకున్న రోజుల్లో కళ్యాణ్ అనే యువకుడు పాతబడ్డ థియేటర్‌లో కేవలం ఆర్ నారాయణమూర్తి సినిమాలు ప్రదర్శిస్తూ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నా తన వ్యాపారం చేసుకుంటూ సరదాగా గడిపేస్తుంటాడు. కథలోకి కథానాయిక ప్రవేశించి, ఆమెను ప్రేమించడంతో కళ్యాణ్ జీవితం మలుపు తిరుగుతుంది. ఆమె వల్ల ఒక పెద్ద సమస్యలో చిక్కుకుని, నక్సలైట్లు-పోలీసుల మధ్య నలిగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఆమె ఎవరు, ఈ వివాదంలోకి కళ్యాణ్‌ను ఎందుకు నెట్టిందనే లవ్ ట్రాక్ డ్రామా ఆసక్తిని పెంచుతుంది. - సహనం వందే, హైదరాబాద్**




శ్రీవిష్ణు తనదైన నటనతో కళ్యాణ్ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. సరదా సంభాషణలు, టైమింగ్, డైలాగ్ డెలివరీ, మార్క్ మేనరిజమ్స్‌తో నవ్వులు పూయించి కథను ముందుకు నడిపించారు. కథానాయిక మహిమా నంబియార్ పరిధి మేరకు చక్కగా నటించినా, ప్రేమకథలో లోతు లేక స్కోప్ తగ్గింది. కళ్యాణ్ తల్లిగా నటించిన రాధికా శరత్‌కుమార్ బాలకృష్ణ అభిమానిగా, పేకాట రాయుడిగా చెప్పే డైలాగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు జానకీరామ్ సీరియస్ బ్యాక్‌డ్రాప్‌ను కామెడీగా చూపించే ప్రయత్నంలో భాగంగా ప్రథమార్ధాన్ని సరదా వన్ లైనర్లతో వేగంగా నడిపారు. ఫ్రెండ్ తెలుగు ప్రేమలేఖను ఇంగ్లీష్‌లోకి అనువాదం చేస్తూ 'పండు వెన్నెల'ను 'ఫ్రూట్ మూన్‌లైట్' అని మార్చే సీన్లు బాగా వర్కవుట్ అయ్యాయి.

### నటీనటుల సపోర్ట్... కామెడీ ట్రాక్

ఈ సినిమాలో నటీనటుల బలమైన సపోర్టింగ్ కాస్ట్ పెద్ద ప్లస్ పాయింట్. సత్య, షైన్ టామ్ చాకో, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ, శత్రు కీలక పాత్రల్లో కనిపించారు. సత్య కామెడీ ట్రాక్ కొన్ని చోట్ల బాగా పేలింది. పొట్టిగా ఉండే వడ్డీ వ్యాపారి క్యారెక్టర్ కోసం అసిస్టెంట్ స్టూల్ పట్టుకుని తిరిగే కామెడీ బ్లాక్ అందరినీ నవ్విస్తుంది. ఇంటర్వెల్ ముందు వచ్చే ట్విస్ట్ ద్వితీయార్థంపై మంచి అంచనాలు పెంచుతుంది.

### ద్వితీయార్థం సవాలు...

ద్వితీయార్థంలో సినిమా కాస్త పట్టు సడలి, క్లైమాక్స్ సీన్లు రొటీన్‌గా, ఊహకు అందేలా మారిపోయాయి. కథనంలో స్పష్టత లేకపోవడంతో కొన్ని క్యారెక్టర్లు సరిగ్గా వాడుకోలేదు. విలన్‌గా చేసిన షైన్ టామ్ చాకో పాత్రను ఇంకా శక్తివంతంగా తీర్చిదిద్ది ఉండాల్సింది. సాంకేతికంగా సాయి శ్రీరామ్ ఛాయాగ్రహణం, అడవుల్లో తీసిన సీన్స్ 90ల ఏజెన్సీ వాతావరణాన్ని విజువల్‌గా ఆవిష్కరించాయి. విజయ్ బుల్గానిన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సరిపోయింది. కోనా వెంకట్ స్క్రీన్‌ప్లే, భాను-నందుల సంభాషణలు కామెడీ భాగాల్లో మెరిసాయి.

### లాజిక్ లేని సరదా ఎంటర్‌టైనర్

కామ్రేడ్ కళ్యాణ్ అనేది లాజిక్‌లు వెతక్కుండా కేవలం వినోదం కోసం చూసే ప్రేక్షకులకు మంచి ఛాయిస్. శ్రీవిష్ణు టైమింగ్, రాధిక కామెడీ, సత్య హాస్యం మొదటి భాగంలో బాగా అలరిస్తాయి. కొన్ని చిన్నపాటి లోపాలు పక్కన పెడితే వీకెండ్‌లో సరదాగా థియేటర్‌కు వెళ్లి నవ్వుకోవడానికి ఈ చిత్రం ఉపయోగపడుతుంది. లోతైన కథల కంటే కూడా కలకాలం నిలిచే నవ్వులే ముఖ్యం అనుకునేవారికి ఈ సినిమా సరైన ఎంజాయ్‌మెంట్ ఇస్తుంది.

# బ్యాంకు ఉద్యోగం... 36 కోట్ల జీతం

## హెచ్‌డీఎఫ్‌సీ కొత్త సీఈఓకు భారీ ప్యాకేజ్

- దేశంలోనే అత్యధిక జీతం పొందే బ్యాంకర్
- బోనస్ సహా మొదటి ఏడాది చేతికి 43 కోట్లు

**రోజుకి ఎంత సంపాదిస్తే నెలకు లక్ష రూపాయలు వస్తాయి అని మనం లెక్కలు వేసుకుంటూ ఉంటాం. కానీ ఒక బ్యాంక్ సీఈఓ జీతం నెలకు దాదాపు మూడు కోట్ల రూపాయలు అంటే మీరు నమ్ముతారా? అసలు బ్యాంక్ ఉద్యోగులకు ఇంత భారీ స్థాయిలో జీతాలు ఇవ్వడం వెనుక ఉన్న అసలు సీక్రెట్ ఏంటి? భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ కొత్త సారథికి ఎలాంటి ప్యాకేజీ ఆఫర్ చేసిందో తెలిస్తే మీ మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే. ఆ విస్తుపోయే విశేషాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. - సహనం వందే, న్యూఢిల్లీ**




భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ త్వరలోనే ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతోంది. ఈ బ్యాంక్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా బాధ్యతలు స్వీకరించడానికి అనూప్ బాగ్చీ సిద్ధమయ్యారు. ఆయనకు సంవత్సరానికి ఏకంగా రూ. 36 కోట్ల వార్షిక వేతనాన్ని అందించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే భారత బ్యాంకింగ్ చరిత్రలోనే అత్యధిక జీతం పొందే సీఈఓగా ఆయన సరికొత్త రికార్డును నెలకొల్పుతారు. ఈ ప్రతిపాదిత ప్యాకేజీకి సంబంధించి ఇప్పటికే ఆర్‌బీఐ నుండి అవసరమైన అనుమతులు లభించినట్లు సమాచారం.

### కళ్ళు చెదిరే జాయినింగ్ బోనస్

అనూప్ బాగ్చీ బ్యాంక్‌లో చేరే సందర్భంలో ఒకేసారి పొందే వన్ టైమ్ జాయినింగ్ బోనస్ కూడా చాలా భారీగా ఉంది. ఆయనకు రూ. 7.35 కోట్ల విలువైన స్టాక్ ఆధారిత జాయినింగ్ బోనస్‌ను ఇవ్వాలని బ్యాంక్ నిర్ణయించింది. అంటే తన మొదటి సంవత్సరంలో అన్ని రకాల ప్రయోజనాలతో కలిపి ఆయన ఏకంగా రూ. 43.24 కోట్ల వరకు అందుకునే అవకాశం ఉంది.

### ఐసీఐసీఐ బ్యాంక్‌లో అపార అనుభవం

ఐసీఐసీఐ బ్యాంక్‌లో సుదీర్ఘ కాలం పాటు పనిచేసి ఆ రంగంలో అపారమైన అనుభవం సంపాదించిన వెటరన్ బ్యాంకర్ అనూప్ బాగ్చీ. బ్యాంకింగ్ విభాగంలో డిజిటల్ విప్లవం తీసుకురావడంలో, నెట్‌వర్క్ విస్తరణలో ఆయన చూపిన చాకచక్యం బ్యాంకింగ్ వర్గాల్లో మంచి పేరు తెచ్చిపెట్టింది. అందుకే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆయన అనుభవాన్ని, నైపుణ్యాన్ని గుర్తించి ఈ స్థాయిలో ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

### నాయకత్వాన్ని ఆకర్షించేందుకే భారీ ప్యాకేజీలు

ప్రస్తుతం భారతదేశంలోని ప్రధాన ప్రైవేట్ బ్యాంకులైన ఐసీఐసీఐ, యాక్సిస్, కొటక్ మహీంద్రా వంటి సంస్థల సారథుల కంటే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ కొత్త అధిపతికి అత్యధిక ప్రాధాన్యతతో పాటు భారీ ప్యాకేజీని కేటాయించింది. బ్యాంకింగ్ రంగంలో మారుతున్న సాంకేతిక మార్పులు, పెరుగుతున్న పోటీ వాతావరణంలో పెద్ద బ్యాంక్‌ను లాభాల బాటలో సమర్థవంతంగా నడిపించడం చాలా సవాలుతో కూడుకున్న పని. అత్యున్నత నాయకత్వ ప్రతిభ కలిగిన వ్యక్తులను ఆకర్షించడానికి, నిలబెట్టుకోవడానికి బ్యాంకింగ్ రంగాలు ఈ తరహా భారీ వేతనాలను కేటాయిస్తుంటాయి. ఈ నెల 27న ఆయన అధికారికంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.